

పేరుకే పెద్దాసుపత్రి..!



టెక్కలి జిల్లా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటం..సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రిలో సేకరించిన చెత్తను గుట్టలుగా పడేస్తున్నారు. సకాలంలో తరలించకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయి. ఆవరణలో పనికి రాని మొక్కలు పెద్దఎత్తున పెరగడంతో విష కీటకాలకు ఆవాసంగా మారాయి. వెనుక భాగం మురుగు నీటి నిల్వ కేంద్రంగా మారింది. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

మదనాపురంలో సైబర్ మోసం



● బాలింత ఖాతా నుంచి రూ.23 వేలు స్వాహా

సారవకోట, న్యూస్‌టుడే: సైబర్ నేరస్థుడి మాటలు నమ్మి సారవకోట మండలం మదనాపురం గ్రామానికి చెందిన ఓ బాలింత రూ.23 వేలు పోగొట్టుకున్నారు. స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త రాగోలు అప్పన్నమ్మ (అరుణ) తెలిపిన వివరాల మేరకు 'సైబర్ నేరస్థుడు శనివారం మధ్యాహ్నం 81718 72148 నంబరు నుంచి ఫోన్ చేశాడు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం వివిధ పథకాల పేరిట బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని నిర్ణయించిందని.. వారి ఫోన్ నంబర్లు ఇవ్వాలని కోరాడు. కేంద్రంలో పిల్లలకు భోజనం తినిపిస్తుండటంతో తరువాత ఫోన్ చేయాలని సూచించారు. ఫోన్ మధ్యలో కట్ చేయకూడదని.. వివరాలు తెలియజేయాలని కోరాడు. అందుబాటులో ఉన్న నలుగురు బాలింతల ఫోన్ నంబర్లు ఇచ్చాను. వెంటనే పిట్ట కల్యాణి అనే బాలింతకు అతను ఫోన్ చేసి నా నుంచి సేకరించిన సమాచారాన్ని తెలియజేసి నమ్మించాడు. ఎన్టీఆర్ పథకం కింద మీ బ్యాంకు ఖాతాలో రూ.16 వేలు జమ చేయాలని ప్రభుత్వం సూచించిందని తెలియజేశాడు. మొత్తం జమ కావాలంటే ఖాతాలో రూ.20 వేలు ఉండాలని చెప్పాడు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి ఫోన్‌పే ద్వారా రూ.20 వేలు జమ చేయించుకున్నారు. అంతకు ముందు ఉన్న రూ.3 వేలతో కలిపి రూ.23 వేలు ఉపసంహరించినట్లు సెల్‌ఫోన్‌కు సందేశం వచ్చింది. మోసపోయానని గుర్తించిన కల్యాణి నన్ను ప్రశ్నించారు. సైబర్ నేరస్థుడి ఫోన్ నంబరుకు సంప్రదించగా స్విచాఫ్ వచ్చింది. ఈ విషయాన్ని పోలీసు శాఖలో పని చేస్తున్న నా భర్త బి.తిరుపతిరావు, ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను' అని అరుణ వివరించారు. ఆయన శ్రీకాకుళంలోని సైబర్ క్రైం అధికారులకు సమాచారమిచ్చారని మాజీ సర్పంచి పి.అప్పారావు తెలిపారు.

చివరికి చేరని నీటిచుక్క..!

● కాలువల్లో తగ్గిన వంశధార ప్రవాహ సామర్థ్యం
● శివారు భూముల రైతుల్లో ఆందోళన

పొట్ట దశ, గింజ పాలుపోసుకునే దశకు చేరిన వరి పంటకు సాగునీరు అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వైకాపా పాలనలో వంశధార నీటి కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొని సాగు చేసినా దిగుబడులు సక్రమంగా రాక నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పలాస వంశధార సబ్‌డివిజన్ పరిధిలో అనుకున్న సమయానికి నీరు రావడంతో రైతులు సంతోషించారు. ముందుగానే నాట్లు వేయడంతో ప్రస్తుతం పంట పొట్ట దశకు చేరుకుంది.కీలక సమయంలో నీరందక కాలువల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.



60ఆర్ఎల్ కాలువలో తగ్గిపోయిన వంశధార నీరు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస, న్యూస్‌టుడే

వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా 1,800 క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు రావాలి. ప్రస్తుతం 1,200 క్యూసెక్కుల లోపు వస్తుండటంతో శివారు ప్రాంతాలకు చేరడం లేదు. ఒక్కసారిగా నీటి సామర్థ్యం తగ్గిపోయింది. ఎగువ ప్రాంతంలో కొందరు కాలువల మధ్య అడ్డుకట్ట వేసి పొలాలను తడుపుకోవడంతో సమస్య మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితితో వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం మండలాల్లోని శివారు ప్రాంతాల రైతులు చివరి దశలో పంట చేజారిపోతుందేమోననే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



పొలం తడిపేందుకు రైతుల అవస్థలు

ఇదీ పరిస్థితి

● పలాస సబ్‌డివిజన్ వంశధార కెనాల్ పరిధి నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల రైతులు 22 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో నాట్లు వేశారు. శివారు ప్రాంతాలైన యూకే పురం, నారాయణపురం, బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, నగరంపల్లి, కిడిసింగి, తాడివాడ, పలాస మండలం చినబడాం, పెసరపాడు, అంతరకుడ్డ తదితర ప్రాంతాలకు చివరి దశలో పూర్తిస్థాయిలో నీరు చేరాల్సి ఉంది.

● నందిగాం మండలం కణితివూరు, పీవీపురం, మర్లపాడు, హరిదాసుపురం, నారాయణపురం ప్రాంతాలకు అరకొరగానే వస్తుండటంతో నీటి సామర్థ్యం పెంచి నీరందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● వజ్రపుకొత్తూరు మండలంలోని 60ఆర్ఎల్ కాలువ పాతటెక్కలి, ఎస్‌జే పురం, దేవునల్తాడ మీదుగా సంతబొమ్మాళి మండలం మర్రిపాడు వరకు ఉంది. అటువైపు పూర్తిగా నీటి సామర్థ్యం తగ్గిపోవడంతో ఆయా ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటకు కీలక సమయం



రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. పంటకు ఇది కీలకమైన సమయం. మొదట్లో అనుకున్నంత స్థాయిలో నీరు రావడంతో శివారు ప్రాంతానికి చేరింది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. ఇప్పుడు నీరందించకుంటే చేతికందడం కష్టమవుతుంది. అన్నీ తాలు గింజలుగా మారుతాయి. అధికారులు మా ప్రాంతానికి పూర్తిస్థాయిలో నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి. - హనుమంతు అప్పలస్వామి, రైతు, సీతాపురం

పొలం తడవకుంటే కష్టమే..



ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఈ ఏడాది వర్షాలు అనుకున్న స్థాయిలో లేవు. గత ఐదేళ్లు వంశధార నీరు శివారు ప్రాంతానికి చేరక ఎంతో నష్టపోయాం. ఈ ఏడాది కూటమి ప్రభుత్వ నాయకుల కృషితో నీరు చేరింది. ఇప్పుడు చాలా కీలకమైన దశ. ఇప్పుడు పొలం తడవకుంటే పంట చేజారిపోతుంది. రైతులు నష్టపోకుండా శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు తీసుకుని ఆదుకోవాలి. - తమ్మినాన బాలకృష్ణ, రైతు, పెద్దబొడ్డపాడు



పీవీపురం వద్ద పొట్ట దశలో వరి పంట

నాలుగైదు రోజుల్లో అందేలా చర్యలు..

హిరమండలం రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం తగ్గడంతో కొంత సమస్య తలెత్తింది. పలాస ప్రాంతానికి చివరి దశలో నీరు చేరాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. 2,400 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన ప్రధాన కాలువల ద్వారా కనీసం 1,800 క్యూసెక్కులు నీటి సామర్థ్యం ఉంటే పలాస వరకు నీరు సమృద్ధిగా అందుతుంది. ప్రస్తుతం ప్రధాన కాలువలో 1,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉండటంతో శివారు ప్రాంతానికి నీరు పారడం కష్టంగా మారింది. కుడి ప్రధాన కాలువ వైపు నీటి సామర్థ్యం తగ్గించి ఎడమ ప్రధాన కాలువ వైపు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాలుగైదు రోజుల్లో శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు వేగవంతం చేస్తాం. - టి.రాజశేఖర్, ఏఈఈ, వంశధార శాఖ, పలాస సబ్‌డివిజన్

హైజంప్‌లో క్రీడాకారిణికి పసిడి పతకం



శ్రీకాకుళం అర్బన్, పలాస క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కాశీబుగ్గకు చెందిన 'ఈనాడు లక్ష్య' క్రీడాకారిణి **పోతనపల్లి యశ్విత** పసిడి పతకం సాధించింది. గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రా తరఫున హైజంప్ పోటీల్లో పాల్గొని, 1.5మీ. ఎత్తు ఎగరడంతో ఈ ఘనత దక్కింది. ఈ సందర్భంగా ఆమెను సాయ్ శిక్షకుడు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, లక్ష్య శిక్షకుడు కొణతాల రామారావు తదితరులు అభినందించారు.

ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, వసతిగృహ సంక్షేమాధికారికి సంజాయిషీ నోటీసులు

పాతపట్నం, మెళియాపుట్టి, సీతంపేట, న్యూస్‌టుడే: పాతపట్నంలో నిర్వహిస్తున్న మెళియాపుట్టి ఏకలవ్య ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, సంక్షేమాధికారులకు సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. వారు సకాలంలో స్పందించకపోవడం.. అలసత్వం వహించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించినట్లు తెలిపారు. ఈ నెల 16న పీవో ఆకస్మికంగా మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో పర్యటించి ఆశ్రమ, గురుకుల పాఠశాలలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు, సంక్షేమాధికారులు అందుబాటులో లేకపోవడం.. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటం, మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మెళియాపుట్టి మండలం పెద్దమడి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వార్డెన్, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్, పాతపట్నం మండలం బైదలాపురం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్‌లకు మెమోలు జారీ చేశారు.

నైపుణ్యాలే సోపానాలు..!

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు : 4   విద్యార్థులు: సుమారు 10 వేల మంది



ఇంజినీరింగ్‌లో చేరగానే సాఫ్ట్‌వేర్ కొలువు దక్కించుకోవాలని విద్యార్థులు కలలు కంటున్నారు. ప్రస్తుతం ఆ రంగంలో ఉద్యోగం దక్కించుకోవడం.. అందులో స్థిరపడటం అంత సులువేం కాదని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే ప్రారంభం కావాల్సిన నియామక ప్రక్రియ ఆలస్యమవుతోంది. ప్రముఖ సంస్థలు సైతం ఎంపికలు వాయిదా వేసుకుంటూ వస్తున్నాయి. జిల్లాలో ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్న చివరి సంవత్సరం విద్యార్థులు ఉద్యోగ నియామకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కోర్ ఉద్యోగాల్లో అవకాశాలు మెరుగవుతున్నాయని.. వాటిపై దృష్టిపెట్టాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

సృజనాత్మకత ఉంటేనే ఇంజినీరింగ్ విద్యార్థులకు కొలువులు

కోర్ ఉద్యోగాలపై దృష్టి సారించాలని నిపుణుల సూచన

జిజ్ఞాస పెరగాలి

ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు తగినట్లు వారిలోని నైపుణ్యాన్ని పెంచుకోవాలి. కళాశాల స్థాయిలో అందుబాటులో ఉన్న అన్ని వనరులు వినియోగించుకోవాలి. వారిలోని జిజ్ఞాస ద్వారానే నైపుణ్యం పెరుగుతుంది. నవంబరులో ప్రముఖ సంస్థలు నియామక ప్రక్రియ నిర్వహించనున్నాయి. - వీవీ నాగేశ్వరరావు, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్, టెక్కలి

టెక్కలి, న్యూస్‌టుడే

కొలువులకు పోటీ పెరిగిన నేపథ్యంలో ఉద్యోగ ఎంపికలు మరింత కఠినమయ్యాయి. విద్యార్థుల నుంచి ఎక్కువ నైపుణ్యాన్ని నియామక సంస్థలు ఆశిస్తున్నాయి. అందుకు తగినట్లు విద్యార్థులు సిద్ధమవలేకపోతున్నారని శిక్షకులు చెబుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ప్రముఖ కళాశాలకు చెందిన ప్రతినిధి బృందం సాఫ్ట్‌వేర్ రంగంలో దిగ్గజ సంస్థ ఇండియా హెడ్‌ను సంప్రదిస్తే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని.. వాటిని పరిశీలించాకే వస్తామని స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించినట్లు సమాచారం. మరికొన్ని సంస్థలు కోడింగ్‌లో పూర్తి స్థాయి నైపుణ్యాలు ఆశిస్తున్నాయి. యాప్స్ తయారు చేయడం, కాన్ఫరెన్స్ పేపర్లు తీర్చిదిద్దడం, వెబ్‌సైట్ హ్యాక్‌థాన్స్‌లో పాల్గొనడం వంటి నైపుణ్యాలను సంస్థలు ఆశిస్తున్నాయి. వృత్యంతర శిక్షణతో పాటు సర్టిఫికెట్ కోర్సులు చేయడం, బృందంలో పని చేసే నైపుణ్యాలు పెంచుకోవడం, సానుకూల దృక్పథం ఉన్న విద్యార్థులను పరిగణలోకి తీసుకోవడం వంటివి చూస్తున్నారు. ఆంగ్ల భాషా నైపుణ్యంతో పాటు ఈ-మెయిల్ రైటింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని శిక్షకులు చెబుతున్నారు.

● సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ విద్యార్థులకు సంబంధిత రంగాల్లో అవకాశాలు మెరుగవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర భారతదేశంలో పని చేయడానికి సిద్ధపడాలని.. ప్రారంభంలో వేతనంపై కాకుండా అవకాశంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. కోర్ ఉద్యోగాల్లో క్షేత్రస్థాయి పనిపై అవగాహన పెంచుకుంటే మంచి భవిష్యత్తు సొంతమవుతుందని విద్యార్థులకు తెలియజేస్తున్నారు.

● జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉద్యోగ నియామకాలకు నవంబరు నుంచి ప్రముఖ సంస్థలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. విద్యార్థుల్లో నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని.. అందుకు తగినట్లు విద్యార్థులు సిద్ధమవ్వాలని చెబుతున్నారు.

స్వయం కృషితోనే సాధ్యం

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న కోర్సులు నేర్చుకోవాలి. భాషానైపుణ్యం పెంచుకోవాలి. ప్రస్తుతం పరిస్థితులను అధిగమించేందుకు విద్యార్థి స్వయంకృషితోనే సాధ్యపడుతుంది. - బి.రాజేష్, జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడు

పరిస్థితులను అవగతం చేసుకుంటే మేలు..

విద్యార్థులు వృత్యంతర శిక్షణ స్థాయిలోనే పరిస్థితులు అవగతం చేసుకోవాలి. వేతనం కన్నా ఉద్యోగావకాశం పైనే దృష్టి సారించాలి. కోర్ ఉద్యోగాల వైపు ఆసక్తి పెంచుకోవాలి. ప్రారంభ వేతనాలు తక్కువగా ఉన్నా ప్రముఖ సంస్థల్లో వచ్చే కోర్ అవకాశాలకు విద్యార్థులు సిద్ధమవ్వాలి. తల్లిదండ్రులు సైతం దృక్పథం మార్చుకోవాలి. - విద్యాసాగర్, శిక్షణ విభాగం హెడ్, బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఇసుక లారీలతో ఇబ్బందులు..!

● నారాయణపురం కూడలిలో ఆందోళన



గుత్తావిల్లి మార్గంలో నిలిచిన వాహనాలు

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలం గుత్తావిల్లి మార్గంలో ఖండ్యాం రీచ్‌కు ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోందని.. సమీప గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని నారాయణపురం కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. ఇసుక కోసం వచ్చిన లారీలను శనివారం రాత్రి నారాయణపురం వైపు రాకుండా గ్రామానికి చెందిన మహిళలందరూ అడ్డుకున్నారు. వాటిని ఆమదాలవలస మండలం అక్కులపేట, నదిపై ఏర్పాటు చేసిన వంతెన పైనుంచి సంతకవిటి వైపు మళ్లించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పెద్దఎత్తున వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని.. నాగావళి నదిపై ఏర్పాటు చేసిన వంతెన, గుత్తావిల్లి దారిలో కిలోమీటరు పొడవునా ఇసుక లారీలను గంటల పాటు నిలుపుతుండటంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

6 వరకు ఉపాధ్యాయ ఓటరు నమోదు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌వో అప్పారావు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 6వ తేదీతో ఓటు నమోదుకు గడువు ముగుస్తుందని తెలిపారు. అదే నెల 23న డ్రాఫ్టు పబ్లికేషన్ ఉంటుందని, డిసెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించి, 30న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. డీఈవో తిరుమలచైతన్య, డీవీఈవో తవిటినాయుడు, ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు రాజేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గోకులం..రుణపాశం!

ఏళ్లు గడిచినా లబ్ధిదారులకు అందని బిల్లులు

■ సారవకోట మండలం గొర్రిబంద గ్రామానికి చెందిన ఆరుగురికి మినీ గోకులాలు మంజూరయ్యాయి. వారిలో ఇద్దరికే బిల్లులు చెల్లించారు. జగ్గయ్యపేటకు చెందిన ఇద్దరు నిర్మాణాలు పూర్తి చేసినా సగమే సొమ్ము అందింది. అదే గ్రామానికి చెందిన మరో రైతుకు బిల్లు అందకపోవడంతో పిల్లర్ల స్థాయిలో పనులు నిలిపివేశారు.

■ బూర్జ మండలానికి 17 గోకులాలు మంజూరయ్యాయి. ఏడు పూర్తికాగా.. 10 వివిధ దశల్లో నిలిచిపోయాయి. కొందరికే బిల్లులు మంజూరయ్యాయి.

■ నందిగాం మండలంలో 80 మంజూరుకాగా 40 పూర్తయ్యాయి. లబ్ధిదారులందరూ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

■ పోలాకి మండలానికి 50 మంజూరయ్యాయి. 10 గ్రామాల్లో 10 మంది నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ రూ.25 వేల నుంచి రూ.50 వేలు వరకు బిల్లు చెల్లించాల్సి ఉంది. మిగిలిన వారు అర్ధాంతరంగా పనులు నిలిపేశారు.

సారవకోట, నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే

రోడ్లపై పశువుల్ని కడుతుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోందని.. బురదగా ఉండే శాలల్లో జీవాల్ని ఉంచడంతో అనారోగ్యం బారిన పడుతున్నాయనే యోచనతో 2018-19లో తెదేపా ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని అమలు చేసింది. నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసిన వారికి బిల్లుల చెల్లింపులు జరిగాయి. అప్పట్లో 5 శాతానికి తక్కువగా పనులు జరిగితే రద్దు చేశారు. ఈ విషయం తెలియని కొందరు రైతులు రుణం తీసుకుని పూర్తి చేశారు. వైకాపా హయాంలో నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు లబ్ధిదారులు మొర పెట్టుకున్నప్పటికీ ఫలితం లభించలేదు. ఐదేళ్లుగా చెల్లింపుల కోసం నిరీక్షిస్తున్నారు. అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు.

● అప్పట్లో రెండు పశువులు ఉంటే రూ.లక్ష, 4కు రూ.1.5 లక్షలు, 6కు రూ.1.85 లక్షల విలువైన గోకులాలు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ మొత్తంలో రైతు వాటా కింద 10 శాతం చెల్లించాలని సూచించడంతో చాలా మంది ముందుకొచ్చారు.



సారవకోట మండలం గొర్రిబందలో మినీ గోకులానికి బిల్లు అందని రైతు రావాడ సింహాచలం

సగమే అందింది..



ఆరు పశువులకు సంబంధించి మినీ గోకులం మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేశా. సగం బిల్లు అందింది. మిగిలిన సొమ్ము కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నా. - తర్ర దాలినాయుడు, రైతు, జగ్గయ్యపేట

అప్పులపాలయ్యా..



2018లో ఆరు ఆవులకు సంబంధించి గోకులం మంజూరైంది. అధికారుల సూచనల మేరకు నా వాటాగా రూ.18 వేలు చెల్లించా. సుమారు రూ.రెండు లక్షలు రుణం తీసుకుని నిర్మాణం పూర్తి చేశా. ఆరేళ్లు గడిచినా బిల్లు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. - యగళ్ల తేజేశ్వరరావు, బడ్డవానిపేట, నరసన్నపేట మండలం

కూటమి ప్రభుత్వంపై ఆశలు

కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అప్పటి లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి మినీ గోకులాలు నిర్మించామని.. బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని 30 మండలాలకు ప్రస్తుతం 1,050 గోకులాలు మంజూరు కాగా 2,299 దరఖాస్తులు అందినట్లు సమాచారం. రెండు పశువులు ఉంటే రూ.1.15 లక్షలు, 4కు రూ.1.85 లక్షలు, 6కు రూ.2.30 లక్షలు విలువైన గోకులాలు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుతం మంజూరు చేసిన గోకులం పథకాన్ని తమకు వర్తింపజేసి అవసరమైన బిల్లులు చెల్లిస్తే మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

రూపాయి ఇవ్వలేదు..



రెండు పశువులకు సంబంధించి అప్పటి అధికారుల సూచనల మేరకు మినీ గోకులం నిర్మించా. అప్పట్లో అప్పు చేశా. ఇప్పటికి రూపాయి అందలేదు. - మొయ్యి సూర్యనారాయణ, రైతు, గొర్రిబంద

వివరాలు అందజేయాలి..

అప్పట్లో గోకులాల నిర్మాణం పూర్తి చేసిన కొందరికి బిల్లులు అందని మాట వాస్తవమే. లబ్ధిదారులు పశు వైద్యుల ద్వారా ఏడీలకు వివరాలు అందజేయాలి. దరఖాస్తుదారుకు సొమ్ము మంజూరు చేయాలని డీఆర్‌డీఏ పీడీకి నివేదిస్తాం. - పి.మురళీధర్, జేడీ, పశుసంవర్ధక శాఖ, శ్రీకాకుళం



మానవ అక్రమరవాణాపై అవగాహన తప్పనిసరి

మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వక్తలు సూచించారు. శ్రీకాకుళం నగరంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్ట్సు కళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు 'వాక్ ఫర్ ఫ్రీడమ్' పేరిట మౌన ర్యాలీని నిర్వహించారు. అవయవాల దోపిడీ, లైంగికదాడులు, బలవంతపు వివాహాలు వంటి సమస్యల్లో నేటి తరం చిక్కుకొంటుందన్నారు. మానవ అక్రమ రవాణా లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా మెలగాలని అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, వ్యాయామోపాధ్యాయుడు వాసుదేవరావు, ఎస్.జోగినాయుడు, బి.వి.రవి శంకర్, జి.వి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: కొవ్వాడ అణువిద్యుత్తు కేంద్ర నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. నిర్వాసితుల భూములకు సంబంధించి 21 మందికి డబ్బులు చెల్లించాల్సి ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు తెలిపారు. గ్రామస్థులు తాగునీటి అవసరాలకు ధర్మవరం వద్ద ఉన్న పెద్ద చెరువును రిజర్వాయరు చేయడం లేదా నాగావళి నది నుంచి పైప్‌లైను ద్వారా తీసుకు వచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు, ఆర్డీవో సాయిప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పక్కన ఎమ్మెల్యే ఈశ్వరరావు, అధికారులు

ఆలోచింపజేసిన నాటికలు

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలోని బాపూజీకళామందిరంలో సూత్రాఫౌండేషన్, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీల్లో భాగంగా శనివారం మూడు నాటికలు ప్రదర్శించారు. తొలుత ప్రదర్శించిన 'కొండగాలి' 60వ దశకంలో గిరిజనుల జీవితాలకు దర్పణం పట్టింది. రెండో నాటిక 'మార్పు జీవన సత్యం' కుటుంబంలో ఒకరి సంపాదనపై ఆధారపడకుండా అందరూ ఏదో పని చేసి జీవించాలనే ఇతివృత్తంతో సాగింది. చివరి నాటిక 'నిర్జీవ నినాదం' ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు సత్కారం, నగదు పారితోషికం, జ్ఞాపికలు అందజేశారు.

నేటి ప్రదర్శనలు: బొరివంక కళాకారులు 'డెత్‌ఆఫ్ ఎ మ్యాన్ ఈటర్', సప్తమ సూత్రం నాటికలను ఆదివారం ప్రదర్శించనున్నారు.



'కొండగాలి' నాటికలో ఓ సన్నివేశం

తొలగిన చీకట్లు



స్పందనకు వందనం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని శ్రీకాకుళం నగరపాలక సంస్థ, పలాస - కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పురపాలిక పరిధిలోని వీధి దీపాలు నిర్వహణ సక్రమంగా లేని విషయమై శుక్రవారం ఈనాడులో 'పురవీధుల్లో ..నిర్లక్ష్యపు చీకట్లు!' శీర్షికన ప్రచురితమైన కథనంపై శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేయని వీధి దీపాలను దశల వారీగా సిబ్బంది మరమ్మతులు చేపడుతుండటంతో గత కొద్ది రోజులుగా నెలకొన్న సమస్య పరిష్కారమైంది.

యూజీసీ నెట్‌లో ప్రతిభ



గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం అరసవల్లికి చెందిన ఉంగటి రమ్యశ్రీకి దేశ వ్యాప్తంగా నిర్వహించిన యు.జి.సి. నెట్‌లో 130 ర్యాంకు సాధించారు. దేశ వ్యాప్తంగా 11 లక్షల మంది ఈ పరీక్షకు హాజరు కాగా 130వ ర్యాంకు రావడం సంతోషంగా ఉందని రమ్యశ్రీ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్రాయిలర్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

మగువా.. అందుకో రుణం

❖ ఎస్సీ, ఎస్టీ మహిళలకు భరోసా

❖ నవంబరు నుంచి లబ్ధిదారుల ఎంపిక

న్యూస్‌టుడే, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం, కొత్తూరు

మహిళల ఆర్థికస్వావలంబనకు కూటమి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఉన్నతి పథకం ద్వారా రుణాలు అందిస్తోంది. పొదుపు సభ్యులకు రుణ పరపతిని పెంచి రూ.50 వేలు నుంచి రూ.5 లక్షలు చేసింది. ఈ క్రమంలో రూ.50వేల వరకు రాయితీతో కొత్తగా రుణాలిచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. వచ్చే నెల నుంచి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఉన్నతి పథకం కింద..

జిల్లాలో 1293 గ్రామైక్య సంఘాలు ఉండగా ఇందులో సుమారు 20 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్నతి పథకం ద్వారా వీరికి పూర్తిగా వడ్డీలేని రుణాలు ఇస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1160 మందికి రూ.6.45 కోట్ల రుణాలు అందించారు. పలువురికి జీవనోపాధి కింద యూనిట్లు మంజూరు చేశారు. ఈ పథకం కింద మహిళా సంఘాలకు రాయితీతోపాటు స్త్రీనిధి రుణాలు అందజేయనున్నారు.



రూ.5 లక్షలు గరిష్ఠంగా..

గ్రామైక్య సంఘ లబ్ధిదారులకు రూ.50వేలు నుంచి గరిష్ఠంగా రూ.5లక్షల వరకు ఇవ్వనున్నారు. ఈ రుణంతో వివిధ జీవనోపాధులకు చెందిన యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి. చిరు పరిశ్రమలు కూడా పెట్టుకోవచ్చు. వెలుగు ద్వారా ముందుగానే దరఖాస్తులు తీసుకోవాల్సి ఉంటుందని వెలుగు అధికారులు చెబుతున్నారు.

వర్తింపు ఇలా..

ఉన్నతి పథకంలో కొత్త విధానంలో భాగంగా సభ్యురాలు ఎంత తీసుకున్నా.. రాయితీ వర్తించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులను సమకూర్చనున్నారు. ఈ మేరకు ఉన్నతి పథకాన్ని సదరు కార్పొరేషన్‌కు అనుసంధానించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి యూనిట్‌కు రూ.50వేలు రాయితీ దక్కుతుంది.

పూర్తి వివరాలు రావాలి

ఉన్నతి పథకం కొత్త విధానానికి సంబంధించి పూర్తి వివరాలు రావాల్సి ఉంది. అమల్లోకి వస్తే ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆర్థికంగా భరోసా కలుగుతుంది. - శ్రీధర్, ఉన్నతి పథకం కోఆర్డినేటర్, శ్రీకాకుళం

21 నుంచి పోలీసు అమరవీరుల స్మారక కార్యక్రమాలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఈ నెల 21న జిల్లా పోలీసు కార్యాలయంలో అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తాం. ఆ రోజు నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో స్మారక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి. ఇందులో భాగంగా అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించడం, ఓపెన్ హౌస్, కళాజాత బృందాలతో గేయాలు ఆలపించడం, వైద్య శిబిరాల ఏర్పాటు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిర్వహిస్తున్న విధులు వీడియోల రూపంలో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలి. 23, 25 తేదీల్లో టెక్కలి, 26, 30 కాశీబుగ్గ, 28, 29 తేదీల్లో శ్రీకాకుళంలో కార్యక్రమాలు జరగనున్నాయి. 28న జిల్లా పోలీసు కార్యాలయం, 29న టెక్కలి, 30న కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం' అని ఎస్పీ పేర్కొన్నారు.

24న కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులతో సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ నెల 24 నుంచి సమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో ఈ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. అక్టోబరు 24న శ్రీకాకుళం జిల్లాల నాయకులతో షర్మిల సమావేశమవుతారు. పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలం పైడిభీమవరం పంచాయతీలోని ఓ ఫార్మా కంపెనీ సెజ్‌లో పనిచేస్తున్న పూడి చిన్నంనాయుడు(33) అనే కార్మికుడు అనుమానాస్పద స్థితిలో పరిశ్రమలో మృతి చెందాడు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బి.రాజేరు గ్రామానికి చెందిన చిన్నంనాయుడు ఓ ఫార్మా కంపెనీలో కార్పెంటర్ పనిచేస్తున్నాడు. రోజూ లాగే శనివారం కూడా విధులకు హాజరయ్యాడు. పరిశ్రమలో పనిచేస్తుండగా స్పృహ కోల్పోయి పడిపోవడంతో అంబులెన్స్‌లో విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కార్మికుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్మికుడి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని పరిశ్రమ వద్దకు తీసుకొస్తుండగా కందివలస గెడ్డ వద్దకు వచ్చేసరికి జేఆర్‌పురం పోలీసులు అడ్డగించి వారిని వాహనం నుంచి దింపేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటన మధ్యాహ్నం జరిగినప్పటికీ పోలీసులు బయటకు పొక్కనీయకుండా గోప్యత పాటిస్తూ పరిశ్రమకు అండగా నిలిచారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారు రాత్రి పరిశ్రమ ముందు ఆందోళనకు దిగారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం వారితో చర్చలు జరుపుతోంది. చిన్నంనాయుడు తండ్రి సూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు నిలిపి.. చోరీ చేసి



బాధితురాలు పల్లి కనకమ్మ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఇంటిలో విద్యుత్తు నిలిపివేసి వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణం చోరీ చేసిన ఘటన మెళియాపుట్టి మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి, పోలీసుల కథనం మేరకు.. సంతలక్ష్మీపురం పంచాయతీ టక్కోయి గ్రామంలో వృద్ధ దంపతులు పల్లి కృష్ణమూర్తి, కనకమ్మ నివసిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలో చొరబడి కనకమ్మ మెడలోని సుమారు మూడున్నర తులాల బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లారు. ఇంటిలో భర్త కృష్ణమూర్తి లేని సమయంలో విద్యుతు మీటర్ వద్ద సరఫరా నిలిపి వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో సురేష్‌కుమార్

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని గుత్తావిల్లికి చెందిన సనపల సురేష్‌కుమార్‌ను స్థానిక ఎస్సై ఎం.ప్రవల్లిక, సిబ్బంది సాయంతో శ్రీకాకుళం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై వాసుదేవరావు, సిబ్బంది శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ 2022లో సీఐ ఈశ్వర్‌ప్రసాద్‌పై కూన రవికుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యల కారణంగా శ్రీకాకుళం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్‌పైనా, తనపైనా కేసు నమోదు చేశారని, కోర్టులో కేసు వాయిదాలకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9 వాయిదా ఉంటే సంబంధిత లాయరు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో తాను కోర్టుకు హాజరుకాలేకపోయానని, ఇటీవల ఇసుక రవాణా జరగకుండా అడ్డుకున్నందుకు కక్ష సాధింపుగా స్థానిక ఎమ్మెల్యే పోలీసులను తన ఇంటి మీదకు పంపారని పేర్కొన్నారు. ప్రస్తుత తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని పోలీసులకు విన్నవించారు. ఈ వీడియో సమాచార మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తనకు, తన భార్య, పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరిగినా కూన రవికుమారే బాధ్యుడని తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్సై ఎం.ప్రవల్లిక మాట్లాడుతూ పూర్తి విషయం తమకు తెలీదని, శ్రీకాకుళం నుంచి వచ్చిన పోలీసు సిబ్బందికి సహాయంగా వెళ్లానన్నారు.



గుత్తావిల్లిలో పోలీసులతో సురేష్‌కుమార్

నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణ

శ్రీకాకుళం గ్రామీణం, నూస్‌టుడే: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలోని వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ, బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వివరాలు వెల్లడించారు. ఈ కోర్సులకు సంబంధించిన శిక్షణ విశాఖపట్టణం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఇస్తామన్నారు. ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థిని, విద్యార్థులు అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు 7680945357, 7995013422 చరవాణి నంబర్లకు సంప్రదించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కంచిలి మండలంలోని జాతీయ రహదారి పైవంతెన వద్ద మూడు వాహనాల్లో అక్రమంగా సంతకు తరలిస్తున్న 23 గేదెలను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వాహనాలను జప్తు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పశువులను కొత్తవలసలోని గోశాలకు తరలించారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం నుంచి నారాయణవలస సంతకు తరలిస్తుండగా ఈ వాహనాలు పట్టుబడ్డాయి. పశువులను అక్రమంగా తరలిస్తున్న ఎం.హరికృష్ణ, ఆర్.వెంకటరమణ, ఆర్.గోవిందరావు, పి.గోవిందరావుతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై ఎస్సై రాజేశ్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదితం ఉపకార వేతనాల అందజేత

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఏటా ఇచ్చే అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఉపకార వేతనాలను ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్.రావు శనివారం అందజేశారు. ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న దున్న తేజ, ఫోరెన్సిక్ మొదటి సంవత్సరం విద్యార్థిని కంది లావణ్యకు ఒకొక్కరికీ రూ.1.50 లక్షలు అందజేశారు. ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయి విజేతలకు రూ.75 వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు రూ.50 వేలు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. చుక్కా శ్రీలక్ష్మికి ఛాన్సలర్ జీఎస్ఎన్.రాజు రూ.5 వేలు అందజేశారు. డీన్లు ఎంఎల్ఎన్.ఆచార్యులు, సన్నీడియోల్, విజయ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ఆచార్య డీఎన్.రావు, ఉపకులపతి జీఎస్ఎన్.రాజు

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

సమస్య: పలాస మండలం రెంటికోటలోని మేదర వీధిలో డ్రైనేజీలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం: స్థానికులు
సమాధానం: ప్రతిపాదనలు ఉన్నాయి. త్వరలోనే డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం: సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

సమస్య : ఇచ్ఛాపురం పదో వార్డు ఛాత్రాద వీధిలో కాలువ ధ్వంసమైంది. -పి.సావిత్రి, కె.జగన్నాథం, ఇచ్ఛాపురం
సమాధానం : కౌన్సిల్ తీర్మానం మేరకు ఆర్థిక సంఘ నిధులు కేటాయించి సమస్యను పరిష్కరిస్తాం.
-ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బాధిత కుటుంబానికి చేయూత



తమతోపాటు పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన బల్లమూడి భగవతి కుటుంబానికి తోటి సభ్యులు అండగా నిలిచారు. గాయత్రి సమైక్య ఆధ్వర్యంలో శనివారం బాధితురాలి కుటుంబీకులకు సభ్యులంతా చందాలు వేసుకుని స్థానికులతోపాటు రూ.56,218ను అందజేశారు. తెదేపా వార్డు ఇన్‌ఛార్జి నాబిల్లి శ్రీను, ఆర్.పి పుణ్యవతి, సమైక్య ఉపాధ్యక్షురాలు యు.హారతి, కార్యదర్శి కె.మణిమహాలక్ష్మి, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

రూ.2.51 లక్షల చెక్కుల అందజేత



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి నియోజకవర్గంలో పలువురు దాతలు అందించిన రూ.2.51 లక్షల చెక్కులను సీఎం చంద్రబాబుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అందజేశారు. విజయవాడలో శనివారం ముఖ్యమంత్రిని కలిసి

ఎన్టీఆర్ సుజలధార పునరుద్ధరించాలి

ఉద్దానంలో కిడ్నీ ప్రభావిత ప్రాంతంలో ఎన్టీఆర్ సుజలధార ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణకాంత్‌కు ఎమ్మెల్యే గౌతు శిరీష విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం ఆమె అందించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘానికి 8 ఎంఎల్‌డీ తాగునీరు అవసరమని, ఉద్దానం రక్షిత పథకం నుంచి అనుసంధానం చేస్తే నీటిపన్ను పురపాలక సంఘం ద్వారా చెల్లించేందుకు వెసులుబాటు దొరుకుతుందని, పూడిలంక వంతెన నిర్మాణానికి చొరవ చూపించాలని ఆమె పేర్కొన్నారు.

అనుసంధాన రహదారులేవి..?



శివాజీనగర్ సూదికొండ రహదారికి అనుసంధానంగా మార్గం ఇలా..

శివాజీనగర్ వాసులకు నిత్య నరకమే

–న్యూస్‌టుడే, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 20వ వార్డు శివాజీనగర్ వాసులకు ప్రధాన రహదారిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో 24 వీధులుండగా ప్రధాన మార్గంతో చిన్న వీధులకు అనుసంధానం లేకపోవటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. శివాజీనగర్ పక్కనే ఉన్న రోటరీ నగర్, ఎర్రచెరువు నుంచి సూదికొండ రోడ్డులకు సరైన దారి లేకపోవటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పలాస ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ రహదారికి శివాజీనగర్ వీధులు అనుసంధానం చేస్తే భవిష్యత్తులో రాకపోకలు సులభంగా మారే పరిస్థితులు కనబడుతున్నాయని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయానికి వెళ్లేదెలా.. శివాజీనగర్ వాసులకు పురుషోత్తపురం సూదికొండ రహదారి పక్కనే ఉన్న శివాలయం, గణపతితో పాటుగా ఇతర ఆలయాల సందర్శన కోసం మార్గమధ్యలో ప్రైవేటు స్థలం ఉండటంతో రాకపోకలు సాగించేందుకు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనబడుతోంది. స్థలం మధ్యలో రహదారి ఏర్పాటు చేసినా అధికారులు రోడ్డు నిర్మాణం చేపడితే లింకు రోడ్డు అవ్వటమేకాకుండా ఆలయాలకు వెళ్లేందుకు అవకాశం దక్కుతుంది.

అభివృద్ధికి నోచని శ్మశానవాటిక..

పట్టణ ప్రజలకు ఉపయోగపడే శ్మశానవాటికను నేడు శివాజీనగర్, సూదికొండ పరిసర ప్రాంతవాసులంతా వినియోగిస్తుండటంతో దాన్ని అభివృద్ధి చేయాలని పురవాసులు కోరుతున్నారు. శ్మశానవాటికలో ముళ్లకంచెలు తొలగించి పరిశుభ్రం చేయాలని, రహదారి, షెల్టర్ సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం..

శివాజీనగర్‌లో లింకు రహదారుల నిర్మాణాలపై అధికారులతో కలిసి పరిశీలిస్తాం. ఇప్పటికే రెండు పలు నిర్మాణాలకు టెండర్లు పిలిచినా గుత్తేదారులు పనులు చేయలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో శివాజీనగర్ ప్రాంత అభివృద్ధికి చర్యలు చేపడతాం.
-ఎస్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం



శ్మశానవాటిక దుస్థితి..

పరిశుభ్రత పాటించండి

మందస, సోంపేట, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సోంపేట కోర్టు ఆరో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.కిశోర్‌బాబు అన్నారు. మందసలోని బీసీ బాలికల వసతి గృహాన్ని న్యాయమూర్తి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహ నిర్వహణపై ఆరా తీసారు. దస్త్రాలను పరిశీలించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందివ్వాలని వసతి గృహ సంక్షేమాధికారిణి డి.కృష్ణవేణిని సూచించారు. ఎస్సై ఖాదర్ బాషా ఉన్నారు.★ సోంపేటలో వసతిగృహాలను జడ్జి కె.కిశోర్‌బాబు తనిఖీ నిర్వహించి అక్కడ పరిస్థితులు తెలుసుకున్నారు. రాజాం కేజీబీవీ, మామిడిపల్లి, ఎర్రముక్కాం తదితర బీసీ వసతిగృహాలను పరిశీలించారు.



మందస: దస్త్రాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి కిశోర్‌బాబు

పల్లె పండగతో అభివృద్ధికి అడుగులు

పలాస గ్రామీణం, కవిటి గ్రామీణం, సోంపేట, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం కూటమి నాయకులు, అధికారులు పనులకు శంకుస్థాపనలు చేశారు. కూటమి ప్రభుత్వంలోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.



పలాస మండలం కిస్టుపురంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు

ఇళ్ల మధ్య మురుగు



ఇచ్ఛాపురం గ్రామీణం మండలం పరిధి మశాఖపురం కాలనీలో ఇళ్ల మధ్య మురుగు నిలువడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిల్వ ఉండి మురుగుగా మారింది. వారాలు గడుస్తున్న అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి సమస్య పరిష్కరిస్తారని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కె.రామారావుకు వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అడుగుకో గుంత

వజ్రపుకొత్తూరు మండలం పూండిబస్టాండ్ నుంచి గోవిందపురం ఉన్నత పాఠశాల వరకు నందిగాం వరకూ ఉన్న ఆర్ అండ్‌బీ రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. రైల్వే పాత గేటు వద్ద, పుచ్చవీధి కూడలి, ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు పాడై ద్విచక్ర వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పూండి నుంచి పీఎంపురం, రెయ్యిపాడు మీదుగా మంచినీళ్లపేట వరకు ఉన్న మార్గం పూర్తిగా పాడైంది. ఆయా రహదారులను తక్షణమే బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈవిషయమై శాఖ జేఈ జగదీశ్ మాట్లాడతూ.. పూండి-మంచినీళ్లపేట రోడ్డుకు ప్రత్యేక నిధుల కింద రూ.90 లక్షల మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించి రోడ్డును అభివృద్ధి చేస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



అధ్వాన మార్గం..



ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు, ప్రయాణికుల వాహనాలు రాకపోకలు సాగించే మార్గం ఇది. ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తుండటంతో వర్షం పడితే మరింత ఇబ్బందికరంగా మారుతుంది. ఇరు ద్వారాల నుంచి కొంత వరకు మాత్రమే సిమెంటు రహదారిని నిర్మించిన ఆర్టీసీ అధికారులు మధ్యభాగాన్ని మాత్రం వదిలేశారు. ఈ సమస్యను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కమర్షియల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు.
–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

స్పందించారు.. తెరిచారు

స్పందనకు వందనం

కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామంలో మహిళ సాధికార భవనం వృథాగా ఉండటంపై శనివారం ఈనాడులో 'మహిళా సాధికారం భవనం వృథా' అనే శీర్షికన వచ్చిన వార్తపై అధికారులు వెంటనే స్పందించారు. కార్యాలయం చుట్టు పక్కల శుభ్రం చేసి కార్యాలయంలో ఎంపీఎం గోవిందరావు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా ఇక్కడే సమావేశాలు నిర్వహించాలని సీఎఫ్‌ను ఆదేశించారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



పొదలు తొలగింపు



కంచిలి మండలం గొల్లపుట్టుగలో విద్యుత్తు స్తంభాల తీగలపై పొదలు అల్లుకుని ప్రమాదకరంగా మారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంపై 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ఈనాడులో శుక్రవారం వచ్చిన వార్తపై అధికారులు స్పందించారు. ఆ శాఖ ఏ.ఈ గురవయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందితో పొదల తొలగింపు పనులు చేపట్టారు.– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



పలాస: మాట్లాడుతున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

పలాస, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాసలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డీఓ ఎన్.కృష్ణమూర్తి ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో జగనన్నకాలనీలో గృహనిర్మాణాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పెద్ద లేఅవుట్‌గా కోసంగిపురం వద్ద 1955 ఇళ్లు నిర్మాణానికి చర్యలు చేపట్టామని, వచ్చే ఏడాది మార్చి నాటికి శతశాతం ఇళ్లు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటివరకు ఇళ్లు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కమిషనర్ ఎన్.రామారావు, ప్రత్యేకాధికారి బి.రమణమూర్తి, మేనేజర్ పి.రవి, గృహనిర్మాణశాఖ ఏఈ రాజ్ మోహన్ తదితరలుఉ పాల్గొన్నారు. ★ పలాస మండలం తర్లాకోట, బొడ్డపాడు రెవిన్యూ పరిధిలో జగనన్నకాలనీ ఇళ్లను టెక్కలి ఆర్డీఓ ఎన్.కృష్ణమూర్తి పరిశీలించారు. నిర్మాణ పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పురపాలక మేనేజర్ పి.రవి, ఆర్.ఓ.డి.ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ప్రాంతీయ అధికారి వెంకట్ తిలక్

మందస, న్యూస్‌టుడే : యూనియన్ బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆ బ్యాంకు ప్రాంతీయ అధికారి వెంకట్ తిలక్ అన్నారు. మందసలో ఆ బ్యాంకు శాఖను శనివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్న యూనియన్ బ్యాంకు మందసలో శాఖ ప్రారంభం ప్రజల అభీష్టం మేరకు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. శాఖ మేనేజరు ఎస్.విద్యాధరరావు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం

చింతామణి అమ్మవారి ట్రస్ట్ హైదరాబాద్ వ్యవస్థాపకులు ఇందిరాదేవి జన్మదినం సందర్భంగా కవిటి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి చదువు కోసం శనివారం విద్యార్థి తల్లికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇప్పటి వరకూ పలుమార్లు విద్యార్థికి నగదు సాయం అందించినట్లు ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. సభ్యులు కోడి లక్ష్మణరావు, బెందాళం రమేష్, పాండవ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.
–న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పారదర్శకంగా తనిఖీలు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో ఏపీడీ స్వరూపరాణి ఆధ్వర్యంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు అధ్యక్షతన శనివారం సామాజిక తనిఖీల బృందం, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కింద వివిధ పంచాయతీల్లో జరిగిన పనులపై చేపడుతున్న సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో పేర్కొన్నారు. పంచాయతీ స్థాయిలో తనిఖీ బృందాలకు అధికారులు సహకారం అందించాలన్నారు.

ప్రతిభ చూపారు




కాశీబుగ్గలోని మేధా ఉన్నతపాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇందులో విజేతలుగా డి.కిషోర్(10వ తరగతి), హర్షిత పాణిగ్రాహి(9వ తరగతి), పి.ప్రణీత్(10వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ ఐ.సోమేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు బి.సుధాకర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.భీమారావు, టి.ఈశ్వరరావు, అమృతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, పలాస

జాతీయ పోటీల్లో దివ్యాంగుడి సత్తా



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తులసయ్య

ఆత్మవిశ్వాసం ముందు.. అంగవైకల్యం దిగదుడుపే అని ఆ యువకుడు నిరూపించాడు. నడవడమే కష్టం అనుకున్న పరిస్థితిలో.. జాతీయస్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల గ్వాలియర్‌లో జరిగిన 8వ జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో క్వార్టర్ ఫైనల్ వరకూ జట్టును నడిపించాడు. తనదైన శైలిలో అందర్నీ ఆకట్టుకుని ఉత్తమ ఆటగాడిగా పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు ఇచ్ఛాపురం మండలం తులసిగాం గ్రామానికి చెందిన పండూరు తులసయ్య.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం



జాతీయస్థాయి పోటీలో వ్యక్తిగతంగా సాధించిన పతకం

పోలియోతో నడవలేని స్థితి..

తులసయ్య చిరుప్రాయంలోనే పోలియో మహమ్మారి వల్ల నడవలేని స్థితి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా చదువు, క్రీడల్లో రాణించాడు. ఇటీవల జాతీయస్థాయిలో జరిగిన వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాడు. చక్రాల కుర్చీలో గిర్రున తిరుగుతూ.. ప్రత్యర్థి ఊహలకు అందకుండా గోల్ వేసి న్యాయనిర్ణేతలు, తోటి క్రీడాకారులను ఆకట్టుకున్నారు. ఇటీవల కోయంబత్తూరులో జరిగిన దక్షిణభారత స్థాయి వీల్‌చైర్ పోటీల్లోనూ తులసయ్య బృందం రెండోస్థానంలో నిలువగా, ఇక్కడ కూడా తులసయ్య ప్రత్యేక ఆటతో గుర్తింపు పొందాడు.

ఆ క్రీడాకారుడి పరిచయంతో..

ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బీఎస్సీ కంప్యూటర్ కోర్సు డిగ్రీ పూర్తిచేసిన తులసయ్య ఉపాధికోసం స్నేహితులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ప్రైవేటు సంస్థలో అవకాశం లభించింది. వీల్‌చెయిర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు చంద్రశేఖర్‌తో పరిచయం ఆయన్ను క్రీడాకారుడిగా మార్చింది. తెలంగాణా వీల్‌చెయిర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు పద్మ, కోచ్ సాహిల్ ఖాన్‌ను కలిశారు. తొలి పరీక్షలోనే నెగ్గిన తులసయ్యను వారి ఫెడరేషన్ క్రీడాబృందంలో చివరి ఆటగాడిగా చేర్చుకున్నారు. మిగిలిన వారితో కలిసి రెండు నెలల శిక్షణ పొందారు. ఈ నెల 10 నుంచి 13 వరకూ గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి దివ్యాంగ క్రీడాకారుల శిక్షణ కేంద్రంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు క్రీడాకారులకు చక్కటి ప్రోత్సాహం అందిస్తున్నారు. సొంతంగా వీల్‌చైర్ లేకపోవడంతో సాధన చేయలేకపోతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించడంతో పాటు, సాధనకు అవసరమైన వనరులను సమకూర్చాలని కోరుతున్నాను. రాష్ట్రం నుంచి కూడా జట్టును తయారుచేసి, సత్తా చాటుకుంటాం.
-పండూరు తులసయ్య, వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు

అవీ.. ఇవీ.. అన్నీ

ఆదాయాల పెంపునకు కృషి

కంచిలి, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలతోపాటు, అంతర్గత పొదుపు రుణాలు అందజేసి వారిని ఆదాయాల పెంపునకు కృషి చేయాలని వెలుగు ఏపీఎం ఎస్.ప్రసాదరావు తెలియజేశారు. కంచిలి మండలం గోకర్ణపురం సచివాలయ ఆవరణలో మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. బేస్‌లైన్ డేటా, ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి వాలంటీర్లు, నిరక్షరాస్యుల వివరాలు సేకరించాలని తెలిపారు. స్త్రీనిధి మేనేజరు కె.రాము, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే : మరో రెండు రోజుల్లో వర్షాలు కురవనున్న నేపథ్యంలో మత్స్యకారులను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ఎన్.వెంకటరమణ అధికారులకు సూచించారు. ఇచ్ఛాపురం మండలం పరిధి డొంకూరు తీర ప్రాంతాన్ని శనివారం ఆయన డొంకూరు సందర్శించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చాటింపు వేయాలని, అదేవిధంగా రక్షిత భవనంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.★ తుపాను నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ డీవీ సీతారామయ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మెట్టూరు, చీపురుపల్లి, అక్కుపల్లి, ఒంకులూరు తదితర తీర గ్రామాల్లోని తుపాను రక్షిత భవనాలను స్థానిక వీఆర్వోలతో కలిసి పరిశీలన చేశారు. గ్రామస్థులతో మాట్లాడి వసతులు, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు.

రైతు సమస్యలపై సదస్సు

మందస, న్యూస్‌టుడే : 'రైతు సమస్యలు-కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు' అనే అంశంపై విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే జాతీయ రైతు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా నాయకులు కె.మోహనరావు కోరారు. సదస్సు ప్రచారంలో భాగంగా మందసలో ప్రచారం చేపట్టారు. ప్రచార పత్రాలను ఆవిష్కరించారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి, న్యూస్‌టుడే : కుల ధ్రువీకరణ పత్రాల కోసం బెంతొరియాలు చేస్తున్న దీక్షలు శనివారానికి 298వ రోజుకు చేరుకున్నాయి. ఇంకా ఎన్నాళ్లు దీక్షలు చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ విద్యార్థులు, యువకులు ఉన్నత చదువులు, ఉద్యోగాలు కోల్పోతున్నారని, పిల్లలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని వాపోయారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరారు.

విజేతలకు బహుమతులు



హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందస మండలం బహడపల్లిలో నందెన్న సంబరాలు సందర్భంగా శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి నృత్య పోటీలు ప్రేక్షకులను అలరించాయి. ఈ పోటీల్లో బృంద, డ్యూయేట్, సోలో విభాగాలకు సంబంధించి నలభై గ్రామాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో ఇచ్ఛాపురం, టెక్కలి, శ్రీకాకుళం కళాకారులు విజేతలుగా నిలిచారు. గ్రామ కమిటీ సభ్యులు వారికి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు

సోంపేట, న్యూస్‌టుడే: జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హుకుంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేశారు. శనివారం వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు షణ్ముఖరావు, అధ్యాపకులు సోమశేఖర్, ముకుందరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కాశీనగర్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గజపతి జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గారబంద ఠాణా లావణ్యగుడ గ్రామానికి చెందిన పరపతి బైరాగి (64) శ్రీకాకుళం జిల్లా గొప్పిలి నుంచి ముఖ్య రహదారిపై శనివారం ఉదయం నడుచుకుంటూ వెళ్తున్నాడు. సమీపంలో చెకుపోస్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఆయన్ను ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఐఐసీ ప్రశాంత్ నిసిక తెలిపారు.

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని ఎండల మల్లిఖార్జునస్వామి క్షేత్రం వద్ద కార్తిక మాస మహోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి సూచించారు. క్షేత్రాన్ని శనివారం సందర్శించిన ఆయన దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడారు. క్షేత్రం అభివృద్ధి, ఏర్పాట్లపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. దేవాదాయశాఖ ఈవో వాకచర్ల రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత సూచించారు. శనివారం కోటబొమ్మాళి కోర్టు ప్రాంగణంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటారు. కోర్టు సూపరింటెండెంట్ ఎం.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కంచూరులో తాగునీటి పైపులైన్లు వేసేందుకు రోడ్డు తవ్వి వదిలేశారు.
- పిన్నింటి వెంకటరమణ, గ్రామస్థుడు
● క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారిని పునరుద్ధరిస్తాం. **- మీనమ్మ, కార్యదర్శి, బోరుభద్ర**
– న్యూస్‌టుడే, నందిగాం

? టెక్కలిలోని రోటరీనగర్-1లో ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేస్తుండటంతో డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది.
- సదాశివుని రవికుమార్, స్థానికుడు
● ఇప్పటికే ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. చెత్త వేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. **- జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి**

? గోపినాథపురం రైల్వేగేటు వద్ద, ఆర్‌అండ్‌బీ కార్యాలయ ప్రధాన ద్వారం ముందు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. **- స్థానికులు**
● వీధ్యుద్దీపాలు కాలిపోయాయి. కొత్తవి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. **- జగన్నాథరావు,కార్యదర్శి, టెక్కలి**
– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



ప్రతిభకు పదును



టెక్కలి పట్టణంలోని అరుణా విద్యాలయంలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పి.శ్రీహర్షిత (పదో తరగతి), ఎం.అంజని (తొమ్మిదో తరగతి), ఎస్.సాయి దీక్షిత్ (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు దవళ మల్లేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు విజేతలను అభినందించి, ప్రశంసా పత్రాలు అందించారు.
– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

పడకేసినా.. పట్టించుకునే వారేరి..!

మరమ్మతులకు గురైన సౌర రక్షిత నీటి పథకాలు

న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, జలుమూరు, సారవకోట

విద్యుత్తుతో పనిలేదు.. నిర్వహణ భారం ఉండదు.. 24 గంటల పాటు సురక్షితమైన తాగునీరు గ్రామాల్లో అందుబాటులో ఉంటుందని సదుద్దేశంతో పదేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వం నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి సౌరశక్తితో పనిచేసే రక్షిత నీటి పథకాలను ఏర్పాటు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిర్వహణను పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టి వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నరసన్నపేట గ్రామీణం: బాడాంలో ఆనవాళ్లు లేకుండా పోయిన వైనం

ఇదీ పరిస్థితి..

●నరసన్నపేట మండలంలో ఎనిమిదేళ్ల క్రితం తోటాడ, బాడాం గ్రామాల్లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పథకాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ●జలుమూరు మండలంలోని కరవంజి పంచాయతీ మట్టవానిపేటలో పథకం పనిచేయక పోవడంతో గ్రామస్థులు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. ●సారవకోట మండలంలోని గొర్రిబంద పంచాయతీలో కోనవానిపేట గిరిజన గ్రామంలో గత 10 నెలలుగా సోలార్ రక్షిత నీటి పనిచేయడం లేదు. ఇబ్బందులు తీర్చేందుకు ఏర్పాటుచేసిన విద్యుత్తు మోటారు సైతం మరమ్మతులకు గురవడంతో గ్రామస్థులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం

పథకాలకు సంబంధించిన ఏజెన్సీ గడువు తీరడంతో వాటిని పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీలు వాటిని సరిగా నిర్వహించలేక పోవడంతో మూలకు చేరాయి. పనిచేయని పథకాలు ఉన్న గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందిస్తాం. – సుదర్శనరావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్


సారవకోట మండలం కోనవానిపేటలో నిరుపయోగంగా..

ఎదురుగా వస్తే ఎదురుచూపులే



నరసన్నపేట మండలం బాలసీమ- నరసన్నపేట రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బసివలస, బాలసీమ గ్రామాల మధ్య గోతుల్లో నీరు చేరడంతో ఎదురుగా వాహనాలు వస్తే వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ శంకరరావును వివరణ కోరగా ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

హడావుడి ప్రారంభం.. అలంకారప్రాయం

జలుమూరు మండలం యలమంచిలిలో వైకాపా హయాంలో రైతు సేవాకేంద్రం నిర్మాణం పూర్తి చేశారు. చివరి దశ పనులు మిగిలి ఉన్నా జనవరిలో హడావుడిగా ప్రారంభించారు. అనంతరం వదిలేశారు. విద్యుత్తు సౌకర్యం లేక పోవడంతో భవనం అలంకారప్రాయంగా మిగిలింది. దీంతో యలమంచిలి, కొండపోలవలస గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారి కె.సురేష్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు



చివరికి గొట్టాలే మిగిలాయి



నందిగాం మండలం దిమిలాడ గ్రామంలో గతేడాది జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందజేయాలనే ఉద్దేశంతో పైపులైన్లు వేశారు. కానీ ఇంత వరకు కుళాయిలు ఏర్పాటు చేయలేదు. తాగునీరు సరఫరా చేయలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి డిల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా బోరు బావి ఇంకా తవ్వించ లేదని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, నందిగాం

నిర్వహణ లేదు నిర్లక్ష్యమే..!

టెక్కలి పంచాయతీలోని పలు వీధుల్లో చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. నిర్వహణను గాలికొదిలేయడంతో అన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. శంభానవీధిలో పరిస్థితిని చిత్రంలో చూడవచ్చు. సబ్‌కలెక్టర్ కార్యాలయం కూడలి, బీసీ కాలనీ, కుమ్మర, నెల్లూరు, మెట్ట, కోదండరామ వీధుల్లో బోర్లు ఇలాగే ఉన్నాయి. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టిపెట్టి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. పనులు జరిపేందుకు చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు చెప్పారు.
– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



22 నుంచి రీసర్వేపై గ్రామ సభలు

నరసన్నపేట, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు పరిస్కరించేందుకు ఈనెల 22 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం రెవెన్యూ సిబ్బంది సమావేశం జరిగింది. రీసర్వే డీటీ కృష్ణ పాల్గొన్నారు.

మాజీ సైనికోద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నరసన్నపేట, న్యూస్‌టుడే: మాజీ సైనికోద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారిణి ఎ.శైలజ పేర్కొన్నారు. నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మాజీ సైనికోద్యోగుల కుటుంబాలతో అవగాహన సదస్సు జరిగింది. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రెసిడెంట్, ఛైర్మన్లు డి.సాంబశివరావు, డొంకాన రమేష్ పాల్గొన్నారు.


పాతపట్నం: వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి


టెక్కలి పట్టణం: ఎస్టీ బాలుర వసతిగృహంలో ఆహారం తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

విద్యార్థులకు మెరుగైన వసతి, విద్యనందించాలి

పాతపట్నం, హిరమండలం, ఎల్ఎన్‌పేట, టెక్కలి పట్టణం, నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు మెరుగైన వసతి, విద్యనందించాలని పలువురు న్యాయమూర్తులు పేర్కొన్నారు. పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా పలు వసతి గృహాల్లో శనివారం వారు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్షించారు. మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు.


ఎల్ఎన్‌పేట కేజీబీవీలో ఆమదాలవలస సివిల్ జడ్జి మణి..


నరసన్నపేట: బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ


సోమయ్యపేటలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


కోటబొమ్మాళి: కురుడులో పల్లెపండగ కార్యక్రమం

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

సారవకోట, పోలాకి, పాతపట్నం, నందిగాం, టెక్కలి పట్టణం, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులపై దృష్టి సారిస్తామని వక్తలు తెలిపారు.


టెక్కలి పట్టణం: అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కూటమి నేతలు


నందిగాం మండలం ఉయ్యాలపేటలో..

సంక్షిప్త సమాచారం

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని వినతి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: తిలారు రైల్వేస్టేషన్‌లో బరంపురం- విశాఖపట్నం, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని దిల్లీలో శనివారం కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు రామకృష్ణ చెప్పారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: చాకిపల్లి గ్రామానికి చెందిన ముద్ద చిన్నమ్మ అనే మహిళ శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబసభ్యులు టెక్కలిలోని జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసునమోదు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటనలో సీతాపురం గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. అయ్యప్పనగర్‌కు చెందిన కూన కూర్మారావు నీళ్ల సీసా కొనేందుకు ఓ దుకాణం వద్దకు వెళ్లిన సమయంలో నిందితులు దాడిచేసినట్లు చెప్పారు.

మహిళపై అత్యాచార యత్నం

నందిగాం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్ద బాణాపురం పంచాయతీ పెద్దినాయుడిపేట గ్రామానికి చెందిన తుంగాన భువనేశ్వర్‌పై అత్యాచారం యత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన కొండాల సారిక, భువనేశ్వర్ పక్కపక్కన ఇళ్లల్లో నివశిస్తున్నారు. సారిక భర్త మహేష్ శనివారం తెల్లవారు జామున కూరగాయలు తరలించడానికి ఆటోతో బయటకు వెళ్లారు. ఆయన లేని సమయం చూసి సారికపై అత్యాచారం చేసేందుకు భువనేశ్వర్ ఇంట్లోకి ప్రవేశించగా ఆమె కేకలు వేయడంతో గ్రామస్థులు రావడం చూసి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పాడి అభివృద్ధికి ప్రాధాన్యం

నందిగాం, న్యూస్‌టుడే: పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని పశుసంవర్ధక శాఖ జేడీ మురళీధర్ అన్నారు. మండలంలోని దిమ్మిడిజోలలో ఏడీ రవికృష్ణ నేతృత్వంలో శనివారం జరిగిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

జలుమూరు, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించాలని డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. జలుమూరు మండలం రావిపాడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చిన్నారావు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు చోరీ

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో గురువారం రాత్రి ఓ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనం, పూశాంలో మరొక వాహనం చోరీ చేసి సమీప తోటల్లో వదిలి దొంగలు వెళ్లిపోయారు. శనివారం ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో ఓ వ్యాపారికి చెందిన ద్విచక్రవాహనం పట్టపగలే తీసుకెళ్లిపోవడం కలకలం రేపింది. పాతహిరమండలంలో వాహనం చోరీకి గురైందని పలువురు మండల కేంద్రంలో వెతికారు. ఇలా వరుసగా దొంగతనాలు జరగడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై సరుబుజ్జిలి ఏఎస్సై చంద్రినాయుడు వద్ద ప్రస్తావించగా ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భావనపాడు మెరైన్ సీఐ డి.రాము పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం భావనపాడు మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధికి వితరణ

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నంలోని శ్రీజగన్నాథ స్వామి ఆలయ అభివృద్ధికి నల్లి సుజాత, రాజారావు దంపతులు రూ.పది వేలు వితరణగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సాయంగా నగదు ఇచ్చినట్లు వారు తెలిపారు.

పథకం మెరుగుకు ప్రతిపాదిస్తాం

కొత్తూరు, న్యూస్‌టుడే: పొన్నుటూరు ఎత్తిపోతల పథకాన్ని ఏపీ నీటిపారుదల సంస్థ డీఈ కామరాజు, జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు పరిశీలించారు. రైతులు పడుతున్న కష్టాలపై చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వారు పర్యటించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

కొత్తూరు, న్యూస్‌టుడే: మాతలకాలనీకి చెందిన కోల జగదీశ్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు తల్లి కల్యాణి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విద్యార్థి కొత్తూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కల్యాణి ఫిర్యాదులో పేర్కొంది.

స్పందించారు.. పరిష్కారం చూపారు

స్పందనకు వందనం

టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వారు స్పందించి, సమస్యలను పరిష్కరించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే బృందం

పారిశుద్ధ్య పనులు చేపట్టారు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: సోగ్గాడిపేట వీధిలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురుగునీరు రహదారిపై నిలిచిపోవడంతో పలువురు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. సమస్యపై 'వేరే దారి లేదు.. తప్పదు మరి' శీర్షికన ఈనెల 16న ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు స్పందించారు. ఆ ప్రాంతంలో కాలువలో పూడిక తొలగించి మురుగు ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు.

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడ గ్రామం ఇందిరా కాలనీలో లో వోల్టేజ్ సమస్యతో తరుచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడేది. దీంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొనేవారు. ఈ ప్రాంతంలోని విద్యుత్తు నియంత్రిక సైతం మరమ్మతులకు గురైంది. సమస్యపై 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో ఏఈ శివకుమార్ స్పందించి కొత్త విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు.

మురుగు బాధ తీరింది

హిరమండలం, న్యూస్‌టుడే: గులుమూరు గ్రామం ఎగువ వీధిలో బోరుబావి వద్ద మురుగు నిలిచి పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. దీనిపై 'పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికతో ఈనెల 18న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శివాజీ, సర్పంచి ఎస్.కోటి సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గుంతలు పూడ్చారు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక పాత జాతీయ రహదారి నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. సమస్యపై 'గుంతలమయంగా దారి' శీర్షికన ఈనాడులో శనివారం ప్రచురితమైన వార్తకు గ్రామ పంచాయతీ ఈవో దాక్షాయణి స్పందించారు. సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన గుంతలు పూడ్చడంతో పాటు కాలువల పునరుద్ధరణ చేపట్టారు.

పనులు వేగవంతం చేయండి


ప్రసంగిస్తున్న సీడీపీవో కామాక్షి, ఇతర అధికారులు

జలుమూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలని ఐసీడీఎస్ పీవో హెచ్.కె.కామాక్షి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, గ్రామీణ తాగు నీటి విభాగం జేఈ చైతన్య, పంచాయతీరాజ్ జేఈ కె.శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేనక

హిరమండలం, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ టి.మేనక అన్నారు. శనివారం ఆమె అధ్యక్షతన ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు మండల పరిషత్తు సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు మాట్లాడుతూ కొత్తూరు నుంచి టెక్కలి వెళ్లేందుకు హిరమండలం మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని కోరారు. ఉప ఎంపీపీలు వైకుంఠరావు, వి.సావిత్రి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచిలు పలు సమస్యలను అధికారులకు తెలిపారు. అన్ని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ఈ నెల 23న మండల పరిషత్తు కార్యాలయంలో ఎమ్మెల్యే గోవిందరావు ప్రజా దర్బార్ నిర్వహించనున్నారని, ప్రజా ప్రతినిధులు, ప్రజలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రాలు అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్, తహసీల్దారు హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యపై ఎస్ఎఫ్ఐ నిరసన



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లింపుల విషయంలో ఎదురైన సమస్యపై ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం నిరసన తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తిని కలిసి మాట్లాడారు. విద్యార్థులు కోర్సు ఫీజు చెల్లిస్తేనే పరీక్షల ఫీజు కట్టించుకుంటామని మెలిక పెట్టడం దారుణమని సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్జాన దుర్గాప్రసాద్ అన్నారు. స్పందించిన ఆర్డీవో కళాశాల ప్రిన్సిపల్ గోవిందమ్మను పిలిపించి మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అంతవరకు విద్యార్థులతో ఫీజులు కట్టించుకోవాలని సూచించడంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు బి.తరుణ్, ఆర్.మహేష్, డి.ఉమామహేష్, గిరిధర్, సీహెచ్.రవి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

శ్రీకాకుళం
● శ్రీకాకుళం ● ఆమదాలవలస ● ఎచ్చెర్ల

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించ వచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

తెరపై ఈనాడు

★ కీర్తన: వీక్షణం ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: ఇద్దరు ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: లవ్ రెడ్డి

– న్యూస్‌టుడే, అరసవల్లి

అన్నదానికి రూ.లక్ష విరాళం



అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి వారి నిత్య అన్నదాన పథకానికి శ్రీకాకుళం నగరానికి చెందిన బుర్ర రాంబాబు, ఎస్.శ్రీనివాసరావు దంపతులు సంయుక్తంగా రూ.1,00,116ల విరాళం అందజేశారు. శనివారం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ఈవో వై.భద్రాజీకి విరాళం నగదును అందజేశారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సత్తా చూపారు





'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహం జరిగాయి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 'అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 12వ తరగతి విద్యార్థి కృష్ణచైతన్య ప్రథమ, 9వ తరగతి విద్యార్థి ప్రణీత్ ద్వితీయ, పదోతరగతి విద్యార్థి ప్రేమ్‌కుమార్ తృతీయ స్థానాలు పొందారు. వీరికి ప్రశంసాపత్రాలు అందించారు. పోటీతత్వం పెంపొందించేందుకు ఈనాడు నిర్వహిస్తున్న పోటీలు అభినందనీయమని శ్రీకాకుళం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిణి విజయకుమారి పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ప్రతిభ చాటారు..!





ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి చింతాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. ఐ.హేమంత్‌సాయి(10వ తరగతి), ఎన్.సాయి రమేష్(10వ తరగతి) ఇ.పుష్ప (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత, ఉపాధ్యాయులు పి.గౌరీశ్వరరావు, ఆర్.లక్ష్మీనారాయణ, బి.వరహాలునాయుడు, బి.ధాత్రి, కె.వాసుదేవరావు, ఎన్.సుజాత ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆనందలహరి అమలయ్యేనా..?

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒత్తిడి లేని ఆట, పాటలతో పిల్లలకు విద్యను అందించేందుకు వీలుగా గతంలో తెదేపా ప్రభుత్వం ఆనందలహరి(అల) విద్యాభ్యాస కార్యక్రమాన్ని అమలు చేసింది. ఈ ప్రయోగం మొదట్లో మంచి ఫలితాన్నిచ్చింది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరిగినట్లు పలువురు నిపుణులు పేర్కొన్నారు. ప్రారంభంలో మండలానికి రెండు పాఠశాలలనే ఎంపిక చేసిన జిల్లా అధికారులు తరువాత మరో మూడింటిలోనూ నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. తరువాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టించుకునే నాథుడే కరవయ్యారు. దీంతో రూ.లక్షల విలువ చేసే వివిధ రకాల పరికరాలు మూలనపడి ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముందుకొచ్చి 'అల' విద్యాభ్యాస కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకు వస్తే చిన్నారులకు ఎంతో ప్రయోజనం కలుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బోధన ఇలా..

ఈ కార్యక్రమాన్ని ప్రతి మండలంలో రెండు పాఠశాలల్లో నిర్వహించారు. 30 బడుల్లోను అమలైంది. ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉనాధ్యాయులను ఎంపిక చేసి సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ.లక్షలు వెచ్చించి శిక్షణ ఇచ్చారు. 1, 2 తరగతుల విద్యార్థులు త్వరగా పాఠాలు నేర్చుకునేందుకు వీలుగా ట్యాబ్‌లు, బొమ్మలు, కార్డులు, వర్క్ పుస్తకాలు, బల్లలు, ట్రేలు, ఇనుప ర్యాక్‌లు వంటి సామగ్రిని సరఫరా చేశారు. వీటితో ఉపాధ్యాయులు కృత్యాధార బోధన సాగించారు.

● పొందూరు మండలంలోని పొందూరు, రాపాక ప్రాథమిక పాఠశాలల్లోనూ, బూర్జ మండలంలోని గంగంపేట, జంగాలపాడు ప్రాథమిక పాఠశాలల్లోనూ రూ.లక్షల విలువ చేసే పరికరాలు వృథాగా ఉన్నాయి.



సరుబుజ్జిలి భవితా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పరికరాలు

● సరుబుజ్జిలి మండలంలో నందికొండ కాలనీ, కొత్తకోట ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో పాఠశాలకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. ఒక్కో పాఠశాలకు సుమారు. రూ. 2 లక్షలకు పైగా విలువ చేసే పరికరాలు ఇచ్చారు. ప్రస్తుతం అవి చెదలు పట్టి మూలకు చేరి వేరే చోట భవితా కేంద్రంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి.

● ఆమదాలవలస మండలంలోని కలివరం, బొడ్డేపల్లిపేట ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వివిధ పరికరాలు ఆయా పాఠశాలల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయి.

అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది

'అల' కార్యక్రమం మొదట్లో బాగానే సాగింది. దీని నిర్వహణకు ఒక్కో పాఠశాలకు రూ.లక్షల విలువ చేసే పరికరాలను ఇవ్వడం వాస్తవమే. విద్యాబోధనకు ఇద్దరు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత ఈ కార్యక్రమంపై ఎవరూ దృష్టి సారించక పోవడంతో పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమం అమలుకు అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– డి.బాలరాజు, రాజేంద్రప్రసాద్, పి.రామరాజు, ఎన్.శ్యామసుందరరావు, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ ఎంఈవోలు

వ్యాపారానికి పశువుల బెడద



శ్రీకాకుళం నగరంలో పొట్టిశ్రీరాములు కూరగాయల మార్కెట్‌లో పశువుల సంచారం సమస్యగా మారింది. రాత్రి పగలు తేడా లేకుండా అక్కడే తిష్ఠ వేస్తుండటంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతుల్లోని సంచులను లాగి కూరగాయలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు నడుస్తున్నా.. అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వివరణ కోరగా నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

వ్యర్థాలు.. దోమలతో ఇక్కట్లు..!

శ్రీకాకుళం నగరంలోని రామలక్ష్మణ కూడలి సమీపంలోని విశాఖ ఏ కాలనీలో పలు చోట్ల ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, వర్షపునీరు, పొదలు పేరుకోవడంతో స్థానికులు దుర్వాసన, దోమలు, విషకీటకాలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



గొయ్యి పూడ్చరూ..!



ఆమదాలవలస పట్టణంలోని పార్వతీశంపేట జంక్షన్ వద్ద అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై గొయ్యి ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో ఇసుక లారీలు వెళ్లడంతో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో రాత్రి సమయంలో పట్టణానికి వస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్‌ను అడగగా గతంలో గోతిని కాంక్రీటుతో పూడ్చామని, పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఎచ్చెర్ల మండలానికి సాగునీరు అందించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలంలోని రైతులకు సాగునీరందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి ఉపాధి హామీ పనులు, ఆర్అండ్‌బీ, ఇతర శాఖలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపురం నుంచి వస్తున్న నీటిని సాగునీటికి సమస్య లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ నారాయణపురం రిజర్వాయరు నుంచి వస్తున్న కాలువల్లో గుర్రపుడెక్క, సిల్టు తీయకపోవడంతో సాగునీరందడం లేదన్నారు. తక్షణమే లష్కర్లను ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రహదారులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు.



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న విద్యార్థులకు సూచించారు. మండలంలోని రాపాక కూడలిలోని మహాత్మా జ్యోతిబా ఫులే పాఠశాల, వావిలపల్లి ఆదర్శ పాఠశాలలను, బాలుర వసతి గృహాన్ని శనివారం ఆమె పరిశీలించారు. వేడి నీటిని విద్యార్థులు తాగేందుకు అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపల్ ప్రసాద్‌కు చెప్పారు. పాఠశాల, వసతి గృహం పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి బి.జ్యోత్స్న

సందడిగా దుర్గామాత ఊరేగింపు: శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: బలగ రిమ్స్ ఆసుపత్రి రహదారిలో దుర్గామాతను మేళతాళాలు, కళాప్రదర్శనలతో ఊరేగించారు. పాత శ్రీకాకుళంలో ఉమాజఠలేశ్వరాలయంలో నందెన్న ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

పక్కా గృహాలకు బిల్లులు చెల్లిస్తాం

సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా పాలనలో 2014-19 మధ్య నిర్మించిన పక్కా గృహాలకు బిల్లులు చెల్లిస్తామని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలో ఇటీవల రావివలస, నందికొండ కాలనీ, గొల్లపాడు, మతలబుపేట, పురుషోత్తపురం, తెలికిపెంట గ్రామాల్లో మృతి చెందిన తెదేపా కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిల్లాడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ● బూర్జ మండలంలోని ఓవీపేట ఇటీవల విద్యుత్ ఘాతంతో ఉపాధ్యాయుడు మృతి చెందగా ఆయన కుటుంబాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం పరామర్శించారు. ● ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండల, పట్టణ ప్రాంతాల్లో పర్యటించారు. పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన తెదేపా నాయకుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.



మెట్టక్కివలసలో రాడా విజయ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

అధిక పనితీరు కంప్యూటింగ్‌పై అవగాహన అవసరం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు అధిక పనితీరు కంప్యూటింగ్ (హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్-హెచ్‌పీసీ) అవగాహన పెంపొందించుకోవాలని సీ డాక్ మాస్టర్ ట్రైనర్ ఎం.వెంకట కిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అమలు చేస్తున్న సంకల్ప కార్యక్రమంలో భాగంగా శనివారం హెచ్‌పీసీ సాంకేతికతపై సీఎస్ఈ, ఏఐఎంఎల్ విద్యార్థులకు ఒక్కరోజు జాతీయ కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రధానాచార్యులు ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు, విభాగాధిపతులు సత్కరించారు.



వెంకట కిశోర్‌ను సత్కరిస్తున్న రమణమూర్తినాయుడు, తదితరులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

జి.సిగడాం, ఆమదాలవలస గ్రామీణం, ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి సాధ్యమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. జి.సిగడాం మండలం డీఆర్‌వలస గ్రామంలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలు శ్రీకారం చుట్టామన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ● ఆమదాలవలసమండలంలోని కనుగులవలస పంచాయతీలో రూ.కోటితో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెదేపా మండల అధ్యక్షుడు నూక రాజు అన్నారు. "సుగుణవలసలో అధికారులు నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు తెదేపా మండల అధ్యక్షుడు నూక రాజు శంకుస్థాపన చేశారు. ● పల్లె పండగ రాష్ట్రంలోని సర్పంచులు ఎవరిలేని గౌరవాన్ని తీసుకొచ్చిందని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి వెంకట భానోజీనాయుడు అన్నారు. రణస్థలం పంచాయతీలోని నగరపాలెం గ్రామంలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పౌష్టికాహారం తీసుకోండి

జి.సిగడాం, న్యూస్‌టుడే: గర్భిణులు రక్తహీనత లేకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని సీడీ పీవో పాపినాయుడు అన్నారు. పెనసాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి



గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం నారా చంద్రబాబునాయుడిని కోరినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో నాగావళి నదికి రక్షణ గోడ నిర్మించాలని, బందరువానిపేట, పీజీ పేటల ఫిష్‌ల్యాండింగ్ జెట్టీ నిర్మాణం, కళింగపట్నం వద్ద గ్రోయిన్ పనులు చేపట్టాలని కోరామన్నారు.

జాబ్ కార్డుల మంజూరుపై దృష్టి సారించండి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: జాబ్‌కార్డు మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం 18 ఏళ్లు నిండిన వారు రూరల్, అర్బన్‌లో ఎంతమంది ఉన్నారనేది ఆరాతీశారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంఘాల ఆర్థిక బలోపేతం కూటమి లక్ష్యం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నగరంలోని డ్వాక్రా సంఘాల ఆర్థిక స్వావలంబన సాధించాలని తెదేపా 15వ డివిజన్ ఇన్‌ఛార్జి పాండ్రంకి శంకర్ కోరారు. శనివారం చంపాగల్లివీధిలో జరిగిన సమావేశంలో డివిజన్ పరిధిలోని 29 సంఘాలకు అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు క్రమశిక్షణ కలిగిన జీవితం అలవర్చుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.లక్ష్మి అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం కిల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహిళకు పాము కాటు

పొందూరు, న్యూస్‌టుడే: మండలంలోని లైదాం గ్రామ సమీపంలో వ్యవసాయ పని కోసం పొలంలోకి దిగిన జి.పార్వతమ్మ అనే మహిళను నాగుపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాప్రాయం తప్పింది.



ఘనంగా స్వాగత వేడుకలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం స్వాగత వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ శోభారాణి పాల్గొని మాట్లాడారు. శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

పైడితల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత విజయనగరం పైడితల్లి అమ్మవారిని భాజపా విజయనగరం జిల్లా అధ్యక్షుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు జరిపారు. అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని దేవస్థానం సిబ్బంది ఏడుకొండలు ఎమ్మెల్యేకు అందజేశారు.

పెరటి తోటల ఏర్పాటుకు చర్యలు

పొందూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పెరటి తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి అన్నారు. మండలంలోని తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో దస్త్రాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బల్ల కంటయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్సై సత్యనారాయణ అన్నారు. పొందూరులో సిస్టమ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు, పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ మోహనరావు, సాయికృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

